# ఔరా ఆవకాయ!

కూరలలో కెల్లా వంకాయ నెంబర్‌వన్.

ఊరగాయలలో ఆవకాయ టాప్.

అందుకనే మిగతా 'పికిల్స్' అంటే లైక్ చేయని రాంబాబు టాపరే!

ఇడ్లీల్లో ఎవరైనా కొబ్బరిచట్నీ, శనగచట్నీ, కారంపొడో... అల్లంపచ్చడో నంజుకు తింటారు. కానీ రాంబాబుకి అవేమీ నచ్చవు. ఎంచక్కా ఆవకాయ నంజుకు తినడం చిన్నప్పటినుంచి అలవాటు. ఒక్క ఇడ్లీలోనే కాదు దోసెలలో, ఉప్మాలో, పూరీలో, చపాతీలో... దేనిలోనైనా సరే రాంబాబుకు ఆవకాయ వుండాలి.

భోజనం చేసేటప్పుడు కూడా... కందిపచ్చడిలో ఆవకాయ మిక్స్‌చేసి తింటాడు. ముద్దపప్పులో కలుపుకు తినడానికి ఆవకాయే మెయిన్.

అలా... ఆవకాయ ఊరగాయను రకరకాలుగా కలుపుకుని తింటూ తన్మయత్వంతో మైమరచి లొట్టలేసుకుంటూ... పెద్ద పెద్ద ముద్దలు చేసుకుని... నోరు బార్లాగా తెరచి నములుతూ తింటున్నంతసేపూ పక్కవారితో సైతం మాట్లాడడు. పలుకరించినా పలుకడు. కళ్ల రెండూ మూసుకుని నోట్లో పెట్టుకున్న ముద్ద నుములుతుంటే అచ్చంగా ఆవుగడ్డి మేస్తూ నెమరేస్తున్నట్లే వుంటుంది.

ఆవకాయ అతిగా తినద్దంటూ మమ్మీ నెత్తీ నోరు మొత్తుకున్నా వినడు. ఇదేం ముదనష్టపు అలవాటో? ఎవరైనా చూస్తే దిష్టి చేటు అనేసి మమ్మీ మనసులోనే గొణుక్కుంటూంటుంది.

కూట్లోకి ముప్పొద్దులా ఆవకాయ వుంటే సరి మరోటి వడ్డించమని అడగడు. అది రాంబాబు మార్క్ టేస్ట్! పాతికేళ్ళు వచ్చి ఉద్యోగం వెలగబెడుతూ... పెళ్ళి చేసుకున్న రాంబాబుని బంధువర్గంలోని వారంతా... ఆవకాయ రాంబాబనే పిలుస్తుంటారు. ఆవకాయ కలిపిన అన్నమే ఆఫీసుకు వెళ్ళేటప్పుడు కూడా బాక్స్‌లో పెట్టి తీసుకెళతాడు. రాంబాబు ఆవకాయ అన్నం తింటుంటే ఆ సువాసన ఘాటు పక్కవారి నాసికాపుటాలకి సోకి లంచ్ అవర్లో ఆత్మీయుడెవరైనా ఒక్క ఆవకాయ అన్నం ముద్ద పెట్టమని నోరారా అడిగినా, చేయి చాచినా ససేమిరా పెట్టడానికి మనస్కరించదు.

ఏటా సీజన్లో వంద మామిడికాయలు కొని ఆవకాయ జాడీలకి పెట్టిస్తాడు. ఇంటికే బంధువు వచ్చినా ముక్కల పులుసు చేయించి, ముద్దపప్పు వండించి ఆవకాయ వడ్డించమని శ్రీమతికి చెప్తాడు.

పెళ్ళినాడు వధువు చి.ల.సౌ. పేరిందేవికి వరుడు రాంబాబుకి బంగారు పువ్వుతో వున్న వెండికంచంలో విందుభోజనం వడ్డిస్తే... కంచంలోని పదార్థాల పేర్లు అడిగి మరీ తెలుసుకొని వాటిని పక్కకునెట్టి... "ఆవకాయ ఏది? వడ్డించరేం?" అని అందరికీ వినిపించేలా గావుకేక పెట్టాడు. రాంబాబు అరుపులకి కొత్త పెళ్ళికూతురు ఝుడుసుకుంది. పెళ్ళి పందిట్లో వారంతా ఏం కొంప మునిగిందోనని పరుగెత్తుకొచ్చారు.

'నీ ఆవకాయ పాడుగాను... ఇన్ని వంటకాలు కంచంలో వుండగా? అదెందుకు గుర్తుకొచ్చిందిరా ఇప్పుడు? ముష్టి ఆవకాయ కోసం గొంతు చించుకుంటాడేమిట్రా వెధవ పీనుగ?... నడ్డిమీద చేయి ఆన్చి ముక్కు చివరికంటా వచ్చిన కళ్ళజోడులోంచి చూస్తూ... కొడుకు దగ్గరకొచ్చి మనుమడి గురించి క్వశ్చన్ చేసింది బామ్మ.

'అంతా నీ పెంపకమేగా? అందుకే వాడి గావుకేకలు ఆవకాయ కోసం...' తల్లి ముఖంలోకి ఎగాదిగా చూచి చిరుకోపం ప్రదర్శించాడు రాంబాబు తండ్రి. రాంబాబు బామ్మకి మనుమడు! అంటే పెద్దకొడుక్కి చిన్న కొడుకన్నమాట!

'ఆవకాయ వడ్డించండి. లేకపోతే నా కొడుకు ముద్ద ముట్టడు. రాంబాబు తల్లి సావిత్రమ్మ పక్కనే వున్న వియ్యపురాలితో రుసరుసలాడింది.

పెళ్ళి జరుగుతోంది. మ్యారేజ్ హాల్లో! భోజనాలు తయారుచేసి వడ్డిస్తోంది కేటరింగ్ వాళ్ళు. పెండ్లి కుమార్తె తండ్రి కేటరింగ్ వారికి చెప్పిన మెనూలో ఆవకాయ అయిటం లేకపోవడంతో... దాన్ని తేలేదు.

"ఇప్పటికిప్పుడు ఆవకాయ తెమ్మంటే ఎలాగండీ?" కేటరింగ్ మేనేజర్ నిప్పులు తొక్కిన కోతే అయ్యాడు.

ఆడపెళ్ళివాళ్ళు 'డీలా' పడ్డారు. పెండ్లి కుమారుని కోరిక తీర్చలేని తమ బ్రతుకులెందుకన్నట్లు పిల్ల తల్లీతండ్రి తీవ్రంగా కలతచెంది ఓ తెగ బాధపడిపోతున్నారు. పక్కనే కూర్చున్న పెండ్లి కూతురు తొడగిల్లిన రాంబాబు 'ఆవకాయ వడ్డించకపోతే చిర్రెత్తుకొస్తుంది... మీ మమ్మీడాడీతో చెప్పు...' అంటూ చెవి కొరికేడు. కావలసిందేనంటూ చంటిపిల్ల వాడిలా యాగీ చేసాడు. ఆవకాయ వెండి విస్తట్లో వడ్డించేవరకూ ఎంగిలిపడేది లేదని నిరాహారదీక్షకు ఉపక్రమించాడు.

పెండ్లికుమార్తె పేరెంట్స్ రాంబాబుని బుజ్జగించాలని చూశారు. గడ్డం పుచ్చుకొని బ్రతిమాలాడారు. కాళ్ళు కడిగి కన్యాదానం చేసారు కనుక మరోసారి కాళ్ళు పట్టుకునేటందుకు సిద్ధపడ్డారు మామగారు.

పెళ్లి గ్రాండ్‌గా జరిగినా భోజనాల దగ్గరకు వచ్చేసరికి అంతా ఆగం ఆగం అయింది. మగపెళ్ళివారెవరూ భోజనానికి ఉపక్రమించలేదు. పెండ్లికొడుకు అలిగినప్పుడు తాము

మాత్రం ఎలా తింటామని ఎదురు ప్రశ్న వేశారు. పెళ్ళికొచ్చినవారంతా ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుకుంటున్నారు.

'పైసా కట్నం తీసుకోకుండా ఈ సంబంధం వప్పుకున్నాం. కనీసం అత్తగారికి, ఆడబిడ్డలకు లాంఛనాలు కూడా అక్కర్లేదనుకున్నాం. అలాంటిది పెండ్లికుమారుడు ఆప్టాల్ ఆవకాయ కావాలని అడిగితే... ఆడపెళ్ళివారు ఏర్పాటు చేయలేకపోయారు'. రాంబాబు తండ్రి మరో బాంబు పేల్చాడు.

ఓవైపు పెళ్ళికుమార్తె చి.ల.సౌ. పేరిందేవికి కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయి. ఆకలి దంచేస్తోంది. కళ్ళు తిరుగుతున్నట్టు అనిపిస్తోంది. మొగుడు తిరస్కరించినప్పుడు తాను ఎలా తినగలదు? ఆడదానికి అప్పుడే సంసారంలో కష్టాలు మొదలైనయ్యన్న మాట అనుకుని దిగులుపడింది.

'అయ్యా ఈ పూటకి మమ్ములను మన్నించి భోజనాలు పూర్తి చేయండి. రాత్రి డిన్నర్‌కి ఆవకాయ అందరికీ వడ్డించే ఏర్పాటే చేస్తాను...' అంటూ ఆడపిల్ల తండ్రి ప్రాధేయపడ్డాడు.

అయినా మగపెళ్ళివారి మనసు కరగలేదు. (ఐస్‌ముక్క అయితే కదా కరగడానికి? మగపెళ్ళివారి మనసు ఉక్కుముక్క కదా?)

పెళ్ళికొడుక్కి ఇదేం ఆవకాయ పిచ్చండీ బాబూ? ఈ విచిత్రం ఎక్కడా చూడ్లేదు. చోద్యంగా వుంది! కొందరి కామెంట్.

'ఆవకాయ మా ఇంట్లో పెట్టుకోని ఎరగం వదినగారూ! మా ఇంటిల్లిపాదికీ 'పెప్టిక్ అల్సర్' వ్యాధి ఉంది. డాక్టర్ మా ఇంట్లో వారందరినీ ఆవకాయ, పండు మిరపకాయ కారం వంటి ఊరగాయలు తినొద్దని శాసించాడు. పెండ్లికుమార్తె తల్లి రాంబాబు తల్లితో పరిస్థితిని సమర్థించుకుంటూ చెప్పింది.

'ఈమాట నాకెందుకు చెప్పడం? అదుగో అక్కడున్న మీ అల్లుడితో చెప్పండి. కావాలని కోరింది... ఆవకాయ లేనిదే ముద్ద ముట్టనని అన్నదీ మీ అల్లుడే?' చిటపటలాడింది రాంబాబు తల్లి.

రాంబాబు మిత్రబృందమంతా ఏకమై 'ఆవకాయ వడ్డించాల్సిందే! ఆడపెళ్ళివారూ డౌన్‌డౌన్' అంటూ నినాదాలు మొదలుపెట్టారు పెళ్ళి పందిట్లో.

అరుపులు... కేకలు... నిరసనలు... కుర్చీలు నేలకేసి కొట్టారు. ఆడపెళ్ళివారి మీద తిరగబడ్డారు. అక్కడి వాతావరణం పార్లమెంట్‌ని, అసెంబ్లీని తలపించింది.

ఆవకాయకోసం ఇంత 'రభస' జరగడం చూసి పెళ్ళికొచ్చినవారంతా ముక్కున వేలేసుకున్నారు. విస్తుపోయారు. అసలు విషయమేమిటని మగపెళ్ళివారిని ఆరాతీయగా

తెలిసిందేమిటంటే...

రాంబాబు పసితనం నుంచీ బామ్మ దగ్గర పెరిగాడు. అయిదేళ్ళు వచ్చేదాకా రాంబాబు వంటిన నూలుపోగు వుండేదికాదు. బామ్మకి చచ్చేటంత మడి, ఆచారం. గుడ్డలు తొడిగితే మనుమడు తనను ఎక్కడ తాకి మైలపడేస్తాడేమోనని భయం. అయిదో ఏడు వచ్చినప్పటినుండి పన్నెండు వెళ్ళేవరకూ తడిపి ఆరేసిన అంగవస్త్రం కట్టుకునేవాడు రాంబాబు. అటకమీద వుంచిన ఆవకాయ జాడీని నిచ్చెన వేసుకుని కిందకు దించి, కాస్త ఊరగాయను బామ్మతీసి బయటపెట్టుకున్నాక మళ్ళీ పెద్ద జాడీని అటకమీద పెట్టించేది. బామ్మకు రోటీపచ్చళ్ళు చేయడం ఇష్టముండదు. ఏటికేడాదీ నిలవ వుండే ఆవకాయ మాత్రం పెట్టి వుంచేది. అన్నంలోకి... టిఫిన్‌లోకి అన్నిటికీ అదే! ఆవిధంగా అలవాటు కావడంతో రాంబాబుకి ఆవకాయ కంచంలో కనిపించకపోయినా ఒక్కపూట తినకపోయినా భోజనం చేసినట్లు అనిపించని పరిస్థితి ఏర్పడింది.

ప్రచ్ఛన్న యుద్ధానికి తెరదించాలంటే ఆవకాయ తెప్పించడం ఒక్కటే మార్గమని, వేరే ప్రత్యామ్నాయం ఏదీ లేదనే నిర్ణయానికొచ్చాడు పెళ్ళికుమార్తె తండ్రి. ముగ్గురు బావమరుదులను పిలిచి కార్లేసుకుని వెళ్ళి సిటీ అంతా గాలించి నాలుగైదు జాడీల ఆవకాయను స్వగృహ ఫుడ్స్‌నుంచి కొని తీసుకురమ్మని చెప్పి పంపాడు.

గాలింపు చర్య మొదలుపెట్టి పాతిక కిలోమీటర్ల దూరం సందులు గొందులు తిరిగి ఎలాగైతేనేం స్వగృహ ఫుడ్స్ వారి దుకాణాన్ని వెతికిపట్టుకున్నారు. ఆవకాయ జాడీలను కార్లలో పెట్టుకుని, కుదుపులకు దొర్లిపోకుడా, చిందిపోకుండా జాగ్రత్తగా పట్టుకుని మ్యారేజ్‌హాల్‌కు చేరుకున్నారు.

ఆవకాయ జాడీలను భుజాన పెట్టుకుని పందిట్లోకి నడిచివస్తున్న వాళ్ళని అల్లంత దూరంలోనే చూచీ చూడగానే ఎగిరి గంతేసినంత పనిచేశాడు. ఆవకాయ వచ్చేసిందోచ్ అంటూ మురిసిపోయాడు రాంబాబు. ఇన్ని తిప్పలు పెట్టి మొండికేసిన రాంబాబును మరికొంచెం ఆట పట్టించాలని ఆవకాయ వడ్డన ముందుగా మగపెళ్ళివారి ముందున్న విస్తళ్లలో సర్వ్ చేస్తూ వచ్చారు. ముందు మాకు వేయవచ్చుగా? మనసులోనే ఉడుక్కున్నాడు. ఎప్పుడెప్పుడు ఆవకాయ ముద్ద నోట్లో పెట్టుకుందామా అని ఉవ్విళ్ళూరుతున్నాడు రాంబాబు. చిట్టచివరికి నూతన వధూవరుల వెండి కంచాల్లో వడ్డించి మిగిలిన జాడీలను రాంబాబుకి అందుబాటులో ఉంచారు.

ఎండాకాలం... పైగా కొత్త ఆవకాయ! కలుపుతుంటుంటేనే కమ్మదనం నాసికాపుటాలకు తాకుతోంది. చవులూరుతోంది. వెండికంచంలోని మిగతా పదార్థాలన్నింటినీ పక్కకు నెట్టిన రాంబాబు మొత్తం అన్నంలో ఆవకాయ కలిపి పిసుకుతూ ఇంతింత ముద్దలు చేయడం పక్కనే వున్న పేరిందేవి క్రీగంట గమనిస్తూ ఇతరులు గమనించకుండా మనసులోనే

నవ్వుకుంటోంది. పెళ్ళికొడుకు ఆవకాయ అన్నం తినడం చూచి అత్తమామలు... తల్లిదండ్రులు... పెళ్ళికొచ్చిన వారంతా సంబరపడిపోతూ... 'హమ్మయ్య ఎలాగైతేనేం పెండ్లికొడుకు కోరిక తీర్చగలిగాం' అనుకొని తృప్తిపడ్డారు.

ఆవకాయ అన్నం రుచి పాపం పేరిందేవికి బొత్తిగా తెలియదు. ఆశగా తన కంచం వైపే చూస్తుండడంతో ఓ ముద్ద పక్కనే వున్న భార్యామణి నోట్లో పెట్టాడు. నోట్లో వున్న ఆవకాయ ముద్దని నములుతూ...

'ఓసి దీని దుంపతెగిపోనూ... ఎంత కమ్మగా వుందో? అందుకే నా మొగుడు ఆవకాయ కోసం ప్రాణాలిస్తాడు...' అనుకొని మరో ముద్ద పెట్టమంటూ నోరు తెరిచింది పేరిందేవి ముసిముసి నవ్వులు చిందిస్తూ...

- సమాప్తం -

*(నవ్య వీక్లీ దీపావళి ప్రత్యేక సంచిక 2007)*